మార్పు కోసం ...

# మరో ఉదయం

TELUGU DAILY & NEWS CHANNEL

ప్రచురణ : హైదరాబాద్, ఖమ్మం, అమరావతి, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి/ చీఫ్ ఎడిటర్ : జి. శ్రీధర్ /సంపుటి :5 సంచిక 140/ 13 బుధవారం, డిసెంబర్ 2023 పేజీలు: 4/వెల రూ5/-

విలేకరులు కావలెను

హైదరాబాద్, అమరావతి
కేంద్రాలుగా
నడుపబడుతున్న
మరో ఉదయం
(అక్రిడేషన్ కలిగి ఉన్న)
తెలుగు దినపత్రికకు తెలంగాణ
ఆంధ్ర ప్రదేశ్ లలోని అన్ని జిల్లాలకు
ఇన్చార్జులు, నియోజకవర్గం మండలాలకు
విలేకరులు కావలెను

మరిన్ని వివరాలకు సంపాదించండి
సెల్:9154842842

## జమ్మూకశ్మీర్ పునర్వ్యవస్థీకరణ, సీఈసీ నియామక బిల్లులకు

# పార్లమెంట్ ఆమోదం..!

లోక్‌సభ జమ్మూ కాశ్మీర్ పునర్వ్యవస్థీకరణ (రెండవ సవరణ) బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. బిల్లు జమ్మూ కశ్మీర్ అసెంబ్లీలో 33శాతం రిజర్వేషన్లు కేటాయించనున్నారు. అలాగే, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రభుత్వ (సవరణ)కు సైతం ఆమోదముద్ర వేసింది. బిల్లులపై చర్చ సందర్భంగా హెూంశాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ సమాధానమిచ్చారు. నరేంద్ర మోదీ ప్రభుత్వ నిబద్ధత, సంకల్పానికి అనుగుణంగా మహిళలకు సమానత్వం, అవకాశాల కోసం బిల్లును ప్రవేశపెట్టామన్నారు.బిల్లులతో అసెంబ్లీలో మహిళలకు సముచిత స్థానం లభించేలా మోదీ ప్రభుత్వం సాహసోపేతమైన ముందడుగు వేసిందన్నారు. మహిళల అభ్యున్నతి కోసం.. అసెంబ్లీల్లో వారికి మూడింట ఒక వంతు సీట్లు మహిళలకు రిజర్వ్ చేసేలా బిల్లు తీసుకువచ్చామన్నారు. బిల్లుకు కాంగ్రెస్ ఎంపీ అధిర్ రంజన్ చౌదరి మద్దతు తెలిపారు. జమ్మూ కశ్మీర్‌లో ముందస్తు ఎన్నికలు నిర్వహించాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.అయితే, జమ్మూ కశ్మీర్ పట్ల కేంద్రం అనుసరిస్తున్న విధానాలపై టీఎంసీ ఎంపీ సౌగతా రాయ్ విమర్శించారు.





అలాగే ప్రధాన ఎన్నికల కమిషన్ (సీఈసీ), ఎన్నికల కమిషనర్ల నియామక బిల్లుకు సైతం రాజ్యసభ ఆమోదం తెలిపింది. వాయిస్ ఓటింగ్ ద్వారా బిల్లుకు రాజ్యసభ ఆమోదముద్ర వేసింది. ఆగస్టు 10న సభలో ప్రవేశపెట్టిన ఈ బిల్లు ప్రధాన ఎన్నికల కమిషనర్ (%జజుజ%), ఇతర ఎన్నికల కమిషనర్ల (%జుజం%) నియామకాలకు సంబంధించిన బిల్లుకు పెద్దల సభ పాస్ చేసింది. బిల్లు ఆమోద సమయంలో సభ నుంచి విపక్షాలు వాకౌట్ చేశాయి.

## దయచేసి ఆస్పత్రికి ఎవరూ రావద్దు

### వీడియో సందేశం విడుదల చేసిన కెసిఆర్

హైదరాబాద్,డిసెంబర్12((మరో ఉదయం):



తనను పరామర్శించేందుకు, చూసేందుకు అభిమానులు, పార్టీ నేతలు యశోద ఆస్పత్రికి రావద్దని దయచేసి సహకరించాలని బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు కోరారు. ఈ మేరకు ఓ వీడియోలో సందేశం విడుదల చేశారు. వీడియోలో కేసీఆర్ ఏం చెప్పారంటే... 'నాతోపాటు వందలాది పేషంట్లకు ఇబ్బంది కలగకూడదు. త్వరలోనే కోలుకుని మీమధ్యకు వస్తాను. ఇన్ఫెక్షన్ వస్తుందని డాక్టర్లు నన్ను బయటకు పంపడంలేదు. నేను ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నానని త్వరలో సాధారణ స్థితికి చేరుకుని మీ నడుమకే వస్తానని.. అప్పుడిదాకా సంయమనం పాటించి యశోద దవాఖానకు రావొద్దని కేసీఆర్ సూచించారు. ఈ సందర్భంగా ప్రజలనుద్దేశించి ప్రత్యేకంగా ఓ వీడియోను కేసీఆర్ విడుదల చేశారు. ఇదిలావుంటే సోమాజిగూడ యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ పరామర్శించారు. కేసీఆర్ ఆరోగ్య పరిస్థితిని డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. కేసీఆర్ త్వరగా కోలుకోని ప్రజాసేవలోకి రావాలని అక్బరుద్దీన్ ఆకాంక్షించారు. ఇప్పటికే కేసీఆర్‌ను చంద్రబాబు, చిరంజీవి, ప్రకాశ్ రాజ్, భట్టి విక్రమార్క, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, జూపల్లి కృష్ణారావు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, మోత్కుపల్లి నర్సింహులుతో పాటు పలువురు నాయకులు పరామర్శించిన సంగతి తెలిసిందే. కేసీఆర్ కాలు జారి కింద పడడంతో ఆయనకు హిప్ రిప్లేస్‌మెంట్ సర్జరీ నిర్వహించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం కేసీఆర్ వాకర్ సాయంతో నడుస్తున్నారు. మరో ఐదారు వారాల పాటు కేసీఆర్‌కు విశ్రాంతి అవసరమని వైద్యులు చెప్పారు.

## టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ... సీఎం రేవంత్ రెడ్డి

# సమీక్ష


- సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించిన రేవంత్ రెడ్డి
- సమీక్షలో పాల్గొన్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, డీజీపీ రవిగుప్తా, ఉన్నతాధికారులు
- ప్రస్తుత స్థితి, పరీక్షల నిర్వహణ, తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్న ముఖ్యమంత్రి

టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. కేసు వివరాలు, పురోగతిని గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, డీజీపీ రవిగుప్తా, ఉన్నతాధికారులు, కమిషన్ కార్యదర్శి అనితా రామచంద్రన్ పాల్గొన్నారు. టీఎస్‌పీఎస్సీ ఏర్పాటు, చైర్మన్ సహా సభ్యుల నియామకానికి సంబంధించిన అర్హతలు, ఇతర అంశాలపై ముఖ్యమంత్రి ఆరా తీశారు. కమిషన్ ఇప్పటి వరకు చేపట్టిన నియామకాలు, మిగిలిన నియామకాల ప్రస్తుత స్థితి, పరీక్షల నిర్వహణ, తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రూప్ 1, ఏఈఈ తదితర పరీక్షల ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారంపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కేసులో పురోగతి, ఇప్పటి వరకు జరిగిన విచారణ, తదుపరి కార్యాచరణపై చర్చించారు. అదే సమయంలో ఇతర పరీక్షల తేదీలు, నిర్వహణ అంశంపై చర్చించారు. లీకేజీతో విద్యార్థులు ఇబ్బందిపడ్డారని, కాబట్టి అన్ని అంశాలను పరిశీలించి తగిన విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.



## స్పీకర్ గడ్డం ప్రసాద్ కు గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్.బీమ్ రాజ్ శుభాకాంక్షలు.





హైదరాబాద్: డిసెంబర్12 (మరో ఉదయం):

వికారాబాద్ నియోజకవర్గం ఎమ్మెల్యేగా గెలుపొందిన గడ్డం ప్రసాద్ ను గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ తెలుగు రాష్ట్రాల అధ్యక్షుడు %ఎతీ%.భీమ్ రాజ్ ఆధ్వర్యం లో శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ శాసనసభా సభాపతి గా పదవి బాధ్యతలు చేపట్ట నున్న సందర్భంగా ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రధాన పాత్ర పోషించే భారత రాజ్యాంగం పుస్తకాన్ని బహూక రించారు. అదే విధంగా శాలువా తో సన్మానం చేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ కుమార్ మాట్లా డుతూ ప్రజాస్వామ్య మనుగడకు రాజ్యాం గం వెన్నుముక అన్నారు. తనను స్పీకర్ గా ఎన్నుకుంటున్న ఎమ్మెల్యే లందరికీ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం డాక్టర్ భీమ్ రాజ్ మాట్లాడుతూ స్పీకర్ పదవికే వన్నె తెచ్చే విధంగా ప్రసాద్ కుమార్ సభ ను నిర్వహిస్తారని ఆశాభావం వ్యక్తచేశారు. నిరుపేద ప్రజల పక్షాన నిలబడి పోరాడే వ్యక్తి, ఎంత ఎదిగిన ఒదిగి ఉండే తత్వం కలిగిన ప్రసాద్ కుమార్ ప్రజల గుండెల్లో చిర స్థాయిగా నిలిపోతారని పేర్కొ న్నారు . ప్రభు త్వాన్ని, ప్రతి పక్షాలను సమన్వయం చేసి ప్రజా సమస్యలను నిర్మాణాత్మకంగా చర్చించే విధంగా సభను నిర్వహించే సమర్థవంతమైన నాయకుడు గడ్డం ప్రసాద్ కుమార్ అని కొనియాడారు.ఈ కార్యక్రమంలో జర్నలిస్ట్ లు సురేందర్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు

## కౌలురైతులను ఎలా గుర్తిస్తారో అని చూశా

## తెలంగాణ ప్రభుత్వంపై కెటిఆర్ సెటైర్లు

హైదరాబాద్,డిసెంబర్12((మరో ఉదయం):



మాజీ మంత్రి కేటీఆర్ తెలంగాణ కొత్త సర్కార్‌పై సెటైర్లు వేశారు. కౌలు రైతులను ఎలా గుర్తిస్తారో.. పైసలు ఎట్లా వేస్తారో చూద్దామను కుంటే 6 నెలలు తప్పించుకున్నారుగా? అంటూ 'ఎక్స్' వేదికగా ఎద్దేవా చేశారు. 22 లక్షల మంది కౌలు రైతులకు పెట్టుబడి లేనట్టేనా యాసంగికి అని విమర్శలు గుప్పించారు. మళ్లీ ఒక బహిరంగ లేఖ రాస్తాడా ముఖ్యమంత్రి..? అని విమర్శించారు. యాసంగి సీజన్‌కు సంబంధించి రైతుబంధు నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసే ప్రక్రియను తక్షణమే ప్రారంభించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఏ ఒక్క రైతుకూ ఇబ్బంది కలగకుండా మంగళవారం నుంచిపెట్టుబడి సాయం పంపిణీ చేయాలని సూచించారు. వ్యవసాయ శాఖపై సచివాలయంలో సోమవారం ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగానే రైతుబంధు పంపిణీపై ఆదేశాలిచ్చారు.

## తుఫాన్ ప్రభావిత రైతులకు

# ప్రభుత్వం భరోసా

- రంగుమారిన ధాన్యం కొనుగోలుకు సిఎం ఆదేశాలు
- ఎవ్వరూ ఆందోళన చెందాల్సిన పనిలేదు
- ఉన్నతస్థాయి సమీక్షలో సిఎం జగన్ స్పష్టీకరణ



2 లో

## కాంగ్రెస్ ప్రభుత్వం మనకంటే బాగా చేయాలని కోరుకుందాం!: హరీశ్ రావు

- అధికార పార్టీ వాళ్లు మన మానసిక స్థైర్యాన్ని దెబ్బతీసే ప్రయత్నం చేస్తారన్న హరీశ్ రావు
- పార్టీ పెట్టినప్పుడూ ఎన్నో ఇబ్బందులు పడ్డామని మాజీ మంత్రి వ్యాఖ్య
- పంచాయతీ, పార్లమెంట్ ఎన్నికల్లో మన సత్తా చూపిద్దామన్న హరీశ్ రావు
- కాంగ్రెస్ ప్రజలకిచ్చిన హామీల అమలు కోసం పోరాడుదామని పిలుపు

2 లో



## ఒక్కరోజులో 25 మంది సైనికుల బలి... పాక్ సైన్యానికి సవాలుగా మారిన కొత్త తీవ్రవాద సంస్థ

ఉగ్రవాద మూకలకు చిరునామాగా నిలిచే పాకిస్థాన్ లో కొత్త టెర్రరిస్టు గ్రూపు పురుడుపోసుకుంది. ఈ సంస్థ పేరు తెహ్రీకే జిహాద్ పాకిస్థాన్ (టీజేపీ). ఇప్పుడీ కొత్త తీవ్రవాద సంస్థ పాక్ సైన్యానికి సవాలుగా మారింది. ఇవాళ ఒక్కరోజే 25 మంది పాక్ సైనికులు హతం కాగా, వారందరినీ తామే మట్టుబెట్టినట్టు టీజేపీ ప్రకటించుకుంది. పాక్ లోని ఖైబర్ పఖ్తుంక్వా ప్రావిన్స్ లో నేడు మూడు వేర్వేరు ఘటనల్లో పాతిక మంది సైనికులు మృతి చెందారు. ఈ ఘటనలకు తమదే బాధ్యత అని టీజేపీ పేర్కొంది.

## రాజస్థాన్ సిఎంగా భజన్‌లాల్ శర్మ ఖరారు చేసిన బిజెపి అధిష్టానం

జయపుర,డిసెంబర్12((మరో ఉదయం):



రాజస్థాన్ ముఖ్యమంత్రిపై సస్పెన్స్ ఎట్టకేలకు వీడింది. రాజస్థాన్ ముఖ్యమంత్రిగా భజన్ లాల్ శర్మను ఎన్నుకున్నారు. రాజధాని జైపూర్‌లో జరిగిన బీజేపీ లెజిస్లేచర్ పార్టీ సమావేశంలో భజన్ లాల్ శర్మను బీజేపీ ఎల్పీగా ఎన్నుకున్నారు. మాజీ సీఎం వసుంధర రాజే.. భజన్ లాల్ పేరును ప్రతిపాదించగా బీజేపీ ఎమ్మెల్యేలు అంగీకారం తెలిపారు. దాంతో రాజస్థాన్ తదుపరి ముఖ్యమంత్రి గా భజన్ లాల్ శర్మ త్వరలో ప్రమాణం స్వీకారం చేయనున్నారు. రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిన దాదాపు 9 రోజుల తర్వాత రాజస్థాన్ సీఎం పేరు ఖరారుచేశారు..

TUE - M U_SAT - M U.qxd 13-12-2023 08:47 AM Page 2



మార్పు కోసం ...
మరో ఉదయం
TELUGU DAILY & NEWS CHANNEL

# సంపాదకీయం

## వారం రోజుల్లోనే ప్రభుత్వంపై భరోసా !

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ తరవాత శరవేగంగా నిర్ణయాలు తీసుకుంటున్న తీరు అభినందనీయం. సిఎం రేవంత్ రెడ్డి ,మంత్రులు సమీక్షలు చేస్తూ త్వరితగతిన ఇచ్చిన హామీల మేరకు ముందుకు సాగుతున్నారు. ఇవన్నీ ఒక ఎత్తయితే ప్రజలకు చేరువగా అవుతున్న తీరు కూడా అభినందనీయం. ప్రజల్లో కూడా రేవంత్ నాయకత్వంపై విశ్వాసం ఏర్పడింది. ఏదైనా చేయగలరన్న భరోసా కలిగింది. గతంలో కెసిఆర్ అహంకారంతో ఎవరినీ దరిచేరనీయలేదు. లెక్కలు తీసేవరకు ఆగకుండా రైతుబంధును ముందుగా విడుదలకు ఆదేశించారు. నిరుద్యోగులు ఎదురుచూస్తున్నట్లుగా పబ్లిక్ సర్వీస్ కమిషన్ మరో ఉదయంకు శ్రీకారం చుట్టబోతున్నారు. నియామకాలు, ఖాళీల వివరాలతో రావాలని టిపి పిఎస్సీ ఛైర్మన్‌ను ఆదేశించారు. దీంతో దెబ్బకు ఆయన రాజీనామా చేశారు. అలాగే అనేకమంది సలహాదారులను, కార్పోరేషన్ ఛైర్మన్లను తొలగిం చారు. మొత్తంగా నిరుద్యోగులకు కూడా భరోసా ఏర్పడింది. సిఎం రేవంత్ రెడ్డి కూడా ఈ విషయంలో చిత్తశుద్దితోనే ఉన్నట్లుగా ఉంది. మరోవైపు మంత్రులు కూడా సమీక్షలు చేస్తున్నారు. కాళేశ్వరం అవకతవకల పై ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్షించారు. సమీక్షలు ఒకవైపు చేస్తూనే ప్రజలకు సమాచారం చేరవేస్తున్నారు. ఢిల్లీలో గత పదేళ్లుగా తెలంగాణ భవన్ పంచాయితీ తెంచలేదు. దానిని పునర్నించే పని గురించి ఆలోచించ లేదు. ఇప్పుడా పనికి కూడా మంత్రి కోమటిరెడ్డి పూనుకున్నారు. ఇలా ప్రభుత్వం ఏర్పడిన వారం రోజుల్లో నే చురుకుగా పనులు సాగుతున్నాయి. కెసిఆర్ అధికారంలో ఉండగా ఏం జరుగుతుందో ఎవరికీ తెలిసేది కాదు. ప్రజలకు సమాచారం చేరవేసేది కాదు. కెసిఆర్ ఎవరినీ దరిచేయనీయకుండా చూసుకున్నారు. తన కోటరీతో కాలక్షేపం చేశారు. ప్రజలతో సంబంధం లేకుండా పదేళ్లు అధికార పెత్తనం చెలాయించారు. తాను చేసిందే పనిగా తలచి ప్రజలపై రుద్దారు. కాళేశ్వరం లాంటి పథకాలతో అప్పులకుప్పను చేశారు. సంపద పెంచానని బొంకుతూ..ఐదులలక్షల కోట్లు అప్పుల్లో పెట్టారు.నిరంతర విద్యుత్ ఇస్తున్నానని చెప్పి.. ప్రజలను మభ్య పెట్టి 85వేల కోట్ల అప్పులను చేశారు. ఇవన్నీ ఏనాడు బయటకు రాలేదు. కానీ కొత్త ప్రభుత్వం ఏర్పడ్డ తరవాత వారం రోజుల్లోనే తేడా కనిపిస్తోంది. అందుకే రాజకీయాలలో అహంకారంతో పనిచేస్తే వారి జాతకాలను ప్రజలే మార్చివేస్తారని రుజువు అయ్యింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలి ముఖ్యమంత్రిగా పనిచేసిన కేసీఆర్ ఇంతగా అహంకారం జీర్ణించుకుంటారని ప్రజలు ఊహించి వుండరు. నిజానికి ఉమ్మడి రాష్ట్రంలో రెండవ పర్యాయం ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు తన మంత్రివర్గంలోకి కేసీఆర్‌ను తీసుకోకుండా పక్కనపెట్టడంతో కసితో కెసిఆర్ తెలంగాణ ఉద్యమాన్ని తలకెత్తుకున్నారు. తెలంగాణ ప్రజల్లో ఉన్న సెంటిమెంటును తనకు అనుకూలంగా మార్చుకుని గద్దెను ఎక్కారు. ప్రజలు కూడా కెసిఆర్‌ను నమ్మారు. చంద్రబాబు తన మంత్రివర్గంలోకి కెసిఆర్‌ను తీసుకుని ఉంటే తెలంగాణ ఉద్యమానికి అవకాశం ఏర్పడి ఉండేది కాదేమో..! ఇకపోతే ఇప్పుడు రేవంత్ ప్రభుత్వాన్ని అస్థిర పరచాలన్న ప్రయత్నాలు కూడా జరుగుతున్నట్లుగా ప్రచారం సాగుతోంది. పదిమంది ఎమ్మెల్యేలను తీసుకుంటే మాదే ప్రభుత్వం అని క్షేత్రస్థాయిలో బిఆర్ఎస్ నేతలు విర్రవీగుతున్నారు. ఇలాంటి ప్రచారాలపై రేవంత్ ప్రభుత్వం అప్రమత్తంగా ఉండాలి. ఇదే విషయాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా బహిరంగంగానే వెలిబుచ్చారు. గతంలో ఎమ్మెల్యేలను గంపగుత్తగా కొన్న అనుభవం కెసిఆర్‌కుంది. అందువల్ల ఇలాంటి ప్రయత్నాలను పసిగట్టి ముందుకు సాగాలి. ప్రత్యేక తెలంగాణ లో రెండవ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన రేవంత్ రెడ్డి ప్రజాస్వామ్యబద్దంగా ముందుకు సాగుతున్నారు. ప్రజలు కూడా ఈ విషయంలో నిశ్చింతంగా ఉన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వ అధినేతగా, తెలంగాణ రాష్ట్ర రెండవ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన రేవంత్ రెడ్డి ప్రజల అభిమానం చూరగొని ముఖ్యమంత్రి స్థాయికి ఎదగడానికి పరోక్షంగా కేసీఆరే అహంకారమే కారణంగా చెప్పుకోవాలి. కుమార్తె పెళ్లి సందర్భంగా రేవంత్ రెడ్డిని బయటకు రాకుండా చేయాలని చూసినా.. బెయిల్‌పై బయటకు వచ్చి మళ్లీ వెంటనే జైలుకు వెళ్ళవలసి వచ్చింది. ఈ సంఘటన రేవంత్ రెడ్డి జీవితంలో మరచిపోలేనిదని చెప్పాలి. ఇది రేవంత్‌కు జరిగిన అవమానం. ఇలా తెలంగాణ ఉద్యమకారులు ప్రొఫెసర్ కోదండరామ్ తదితర వేలాదిమందికి ఎన్నో రకాలు గా అవమానాలు జరిగాయి. ఈ క్రమంలో తెలంగాణ పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్ రెడ్డి కూడా మరో తెలంగాణ ఆత్మగౌరవ పోరాటం చేశారు. అందుకే ప్రజలు ఆయనను ఆదరించి చేరదీసి అధికారం కట్ట బెట్టారు. బిఆర్ఎస్, బిజెపిల కుటిల రాజకీయాలరు కూడా ప్రజలు గుర్తించి, కాంగ్రెస్ పార్టీని గుర్తించి ఆదరించారు. రేవంత్ రెడ్డి నాయకత్వానికి ప్రజలు జై కొట్టారు. రేవంత్ రెడ్డి కూడా కెసిఆర్ లాగా కాకుండా అధికారంలోకి రాగేనే ప్రజాభవన్ ప్రారంభించారు. దానిముందున్న ఇనుప కంచెను తొలగించారు. ప్రజల వినతులు స్వీకరించి పరిష్కరించే కార్యక్రమం మొదలు పెట్టారు. ఆర్థిక పరిస్థితిపై లోతుగా అధ్యయనం మొదలు పెట్టారు. గత పదేళ్లుగా ఎక్కడైతే అవినీతి, అక్రమాలు జరిగాయో అక్కడి నుంచే పాలన మొదలు పెట్టడం శుభసూచకం. అందుకే ఒక్కో అంశాన్ని, పథకాన్ని సమీక్షించి ముందుకు సాగాల్సిన బాధ్యత ఇప్పుడు సిఎం రేవంత్ రెడ్డిపై ఉంది. రైతుబంధులో అవినీతిని ఆపి, అడ్డగోలు చెల్లింపులకు చెక్ పెట్టాలి. కిలో రూపాయి బియ్యంపై సమీక్షించాలి. తెల్లరేషన్ కార్డులను అర్హులైన పేదలకే అందించాలి. ప్రభుత్వ ఆస్పత్రులను ఆధునీకరించాలి. హడావిడిగా ప్రచారం చేసిన వైద్యరంగంపై నిజానిజాలు వెలికితీయాలి. ప్రభుత్వ ఆస్పత్రులు బలోపేతం అయితే ఆరోగ్యశ్రీల అవసరం ఉండదు. విద్‌ఆయరంగాన్ని కూడా పటిష్టం చేయాలి. కెజి టూ పిజి ఉచిత విద్యకు ప్రాధాన్యం ఇవ్వాలి. కులాలు, మతాల వారిగా విద్యను చెప్పే విధానాలకు తిలోదకాలు ఇవ్వాలి. ఇలా చేయడం వల్ల పిల్లల్లో కులాల ప్రభావం పెరిగి సమాజంలో విచ్ఛిన్నకర ధోరణుల ప్రబలుతాయి. ఇవన్నీ కూడా సాధ్యమయ్ఏ పనులే. అసాధ్యం అనుకున్న పనులేవీ రేవంత్ ముందు లేవు. ఇకపోతే సమర్థనేతగా ఎదగడానికి కూడా ఇవి దోహదపడతాయి.

## కాంగ్రెస్ ప్రభుత్వం మనకంటే బాగా చేయాలని కోరుకుందాం!: హరీశ్ రావు

మొదటిపేజీ తరువాయి

అధికార పార్టీ వాళ్లు మన మానసిక స్థైర్యాన్ని దెబ్బతీసే ప్రయత్నం చేస్తారని, టీఆర్ఎస్ పార్టీ పెట్టినప్పుడూ ఎన్నో ఇబ్బందులు పడ్డామని, ఆ ఇబ్బందులను ఎదుర్కొని ఎన్నో విజయాలు సాధించామని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. సంగారెడ్డిలో నిర్వహించిన బీఆర్ఎస్ కృతజ్ఞత సభకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... 2004లో కాంగ్రెస్ మనతో పొత్తు పెట్టుకుని తెలంగాణ ఇవ్వకుండా మోసం చేసిందని, తెలంగాణపై కేసీఆర్‌కి ఉన్న ప్రేమ ఇతరులకు ఉండదని వ్యాఖ్యానించారు. పద్నాలుగేళ్లు కష్టపడి, పదవులు గడ్డి పోచల్లా వదిలేసి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించామన్నారు. పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలను గుండెల్లో పెట్టుకుంటామన్నారు. ఓడినందుకు కుంగిపోవద్దని... వచ్చే పంచాయతీ, పార్లమెంట్ ఎన్నికల్లో మన సత్తా చూపిద్దామన్నారు. రాష్ట్రమంతా కొంత ఇబ్బంది ఉన్నా సంగారెడ్డిలో ఈసారి గులాబీ జెండా ఎగిరిందని కార్యకర్తలకు కితాబునిచ్చారు. చింతా ప్రభాకర్ ఆరోగ్యం దెబ్బ తిన్నా ప్రతి ఒక్క కార్యకర్త అభ్యర్థిగా కష్టపడి పని చేశారని ప్రశంసించారు. అధికారంలో ఉన్నప్పుడు పార్టీ పొంగిపోలేదని, లేనప్పుడు కుంగిపోదని అన్నారు. బీఆర్ఎస్ అధికారపక్షంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నా మనం ప్రజల పక్షాన్నే ఉంటామన్నారు. తెలంగాణాని అన్ని రంగాల్లో దేశంలోనే నంబర్ వన్ స్థానంలో నిలబెట్టింది కేసీఆర్ ప్రభుత్వమే అన్నారు. ప్రజలు కాంగ్రెస్‌కు అవకాశమిచ్చారని, మనకంటే బాగా పని చేయాలని కోరుకుందామని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రజలకిచ్చిన హామీల అమలు కోసం పోరాడుదామని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలపై పోరాడే వారికి భవిష్యత్తు ఉ ంటుందని, ఆ అవకాశం మనకు ఉందన్నారు. కార్యకర్తలు ఎవరూ కూడా అధైర్యపడవద్దని, ఉమ్మడి మెదక్ జిల్లాలో ఏడుగురు ఎమ్మెల్యేలు ఉన్నారని, అందరం కలసి పని చేద్దామన్నారు. ఓటమిపై సమీక్ష జరుపుకుందామని, తప్పొప్పులు సరిచేసుకొని ప్రజల పక్షాన నిలబడుదామన్నారు.

## గుప్త నిధుల పేరుతో 15 మందిని హత్య చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలి

-వెంటనే మూఢనమ్మకాలు నిర్మూలన చట్టం తేవాలి.

-చార్వాక జాతీయ సమన్వయకర్త, సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్

కొత్తగూడెం డిసెంబర్ 12(మరో ఉదయం)



క్షుద్ర పూజలు గుప్త నిధుల పేరుతో 15 మంది అమాయకులను హత్య చేసిన నిందితుడు సత్యం యాదవ్ ను కఠినంగా శిక్షించాలని సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ జాతీయ సమన్వయకర్త చార్వాక డిమాండ్ చేశారు. నాగర్ కర్నూల్ జిల్లాలో గుప్త నిధుల పేరుతో ప్రజలను నమ్మించి క్షుద్ర పూజలు చేసి ఆరోగ్యాలను బాగు చేస్తానని మోసం చేస్తూ బాధితుల నుండి లక్షలకు లక్షలు కాజేసి 15 మందిని హత్య చేసిన నిందితుడు సత్యం యాదవ్ ను పోలీసులు అదుపులోకి తీసుకున్నప్పటికీ నిందితుడిని కఠినంగా శిక్షించాలని, అమాయకులైన ప్రజలను మోసం చేస్తున్న భూత వైద్యులను, దొంగ స్వాములను ప్రభుత్వం గుర్తించి అదుపులోకి తీసుకోవాలని అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని హత్యకు గురైన బాధితులకు ఒక్కొక్కరికి 20 లక్షల నష్టపరిహారం ప్రభుత్వం అందించాలని ప్రభుత్వాన్ని చార్వాక డిమాండ్ చేశారు. రాష్ట్రంలో క్షుద్ర పూజలు గుప్తనిధులు మంత్రాలు చేతబడి పేరుతో జరుగుతున్న సంఘటనలపై ప్రభుత్వం వెంటనే ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి మూఢనమ్మకాల నిర్మూలన చట్టాన్ని అమలులోకి తీసుకురావాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ప్రజల్లో మూఢనమ్మకాల పట్ల చైతన్యవంతమైన కార్యక్రమాలు ప్రభుత్వమే చేపట్టాలని డిమాండ్ చేశారు. మూఢనమ్మకాలను నిర్మూలించి శాస్త్రీయ సమసమాజ నిర్మాణానికి ప్రభుత్వాలు కృషి చేయాలని పిలుపునిచ్చారు

మొదటిపేజీ తరువాయి

## తుఫాన్ ప్రభావిత రైతులకు ప్రభుత్వం భరోసా

- రంగుమారిన ధాన్యం కొనుగోలుకు సిఎం ఆదేశాలు
- ఎవ్వరూ ఆందోళన చెందాల్సిన పనిలేదు
- ఉన్నతస్థాయి సమీక్షలో సిఎం జగన్ స్పష్టీకరణ

అమరావతి,డిసెంబర్12((మరో ఉదయం):

తుఫాన్ బాధజత రైతులెవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం అన్నిరకాలుగా ఆదుకుంటుందన్న భరోసా వారిలో కల్పించాలన సీఎం జగన్ ఎమ్మెల్యేలను ఆదేశించారు.ఇటీవల తుపాను కారణంగా దెబ్బతిన పంటలపై, రంగుమారిన వరి ధాన్యం కొనుగోలుపై సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సమీక్షతుపాను బాధిత ప్రాంతాల్లో రైతులను ఆదుకుంటున్న చర్యలపై ఈ సమావేశంలో చర్చకు వచ్చింది. రంగు మారిన, తడిసిన ధాన్యాన్ని పౌరసరఫరాల సంస్థ కొనుగోలు చేస్తోందని స్పష్టంచేశారు. ప్రతి గింజను కూడా కొనుగోలు చేసే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందని, ఇదే విషయాన్ని రైతు సోదరులందరికీ తెలియజేసి, వారిలో భరోసాను నింపాలన్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో లిబరల్‌గా ఉండాలని అధికారులను సీఎం ఆదేశించారు. కొన్ని నిబంధనలు సడలించి అయినా రైతులకు న్యాయం చేయాలన్నారు. రైతుల వద్దనున్న ధాన్యాన్ని కొనుగోలుచేసి మిల్లులకు పంపే బాధ్యతను పౌరసరఫరాల శాఖ అధికారులు తీసుకుంటారని, ఆర్బీకేల వారీగా ఈ కొనుగోళ్లు జరుగుతాయని కూడా సీఎం చెప్పారు. ఇదే సమయంలో సంబంధిత అధికారులకు దీనికి సంబంధించి ముఖ్యమంత్రి ఆదేశాలు జారీచేశారు. అంతేకాక సకాలంలోనే వారికి ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చేందుకు ఇప్పటికే అన్నిరకాల చర్యలు ప్రభుత్వం తీసుకుంటోందని కూడా సీఎం వివరించారు. అలాగే పంటనష్టపోయినవారికి వైయస్సార్ ఉచిత బీమాకింద వారికి పరిహారం అందించడానికి అనుసరించాల్సిన పక్రియను సమర్థవంతంగా చేపట్టి నష్టపోయిన ప్రతిరైతునూ ఆదుకునేలా చర్యలు తీసుకోవాలని సీఎం అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా ఎన్యూమరేషన్ పక్రియ ప్రారంభించారా అని అధికారులను ఆరా తీసిన సీఎం, ఈ నెల 11 నుంచి 18 వరకు ఎన్యూమరేషన్ జరుగుతోందని, 19 నుంచి 22 వరకు సోషల్ ఆడిట్ కోసం ఆర్బీకేలలో లిస్టులు అందుబాటులో ఉంచుతున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు చెప్పారు. ఆ తర్వాత 23 నుంచి 25 వరకు సవరణలు, అభ్యంతరాల స్వీకరణ అనంతరం 26న జిల్లా కలెక్టర్లు తుది జాబితాలు ప్రభుత్వానికి పంపనున్నట్లు తెలిపారు. సంక్రాంతి లోగా ఇన్‌పుట్ సబ్సిడీ రైతులకు అందాలని, అందుకు తగిన విధంగా చర్యలు తీసుకోవాలని ఈ సమావేశంలో సీఎం అధికారులకు సూచించారు. హాజరైన మంత్రి జోగి రమేష్, ఉమ్మడి కృష్ణా జిల్లా ఎమ్మెల్యేలు కొడాలి నాని, పేర్ని నాని, వల్లభనేని వంశీ, సామినేని ఉదయభాను, సింహాద్రి రమేష్, వ్యవసాయ శాఖ స్పెషల్ కమిషనర్ సి.హరికిరణ్, పౌరసరఫరాల శాఖ ఎండీ వీరపాండ్యన్, పౌరసరఫరాల శాఖ కమిషనర్ అరుణ్‌కుమార్, సీఎంవో అధికారులు హాజరయ్యారు.

## రిటైర్డ్ హెడ్మాస్టర్ మద్దిశెట్టి వెంకటేశ్వరరావుకు విద్యా లెజెండరీ అవార్డు ప్రధానం

జూలూరుపాడు , డిసెంబర్12((మరో ఉదయం):

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, జూలూరుపాడు మండలం పాపకొల్లు గ్రామానికి చెందిన డాక్టర్ మద్దిశెట్టి వెంకటేశ్వరరావు రిటైర్డ్ హెడ్ మాస్టర్ , విద్యా రంగంలో వెంకటేశ్వరావు విశిష్ట సేవలు అందించినందుకు ఆయనకు విజయవాడలో తెలుగు వెలుగు సాహితీ వేదిక జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో బాల భవన్ లో జరిగిన కార్యక్రమంలో ప్రతిష్టాత్మకమైన విద్యా లెజెండరీ అవార్డు ప్రదానం చేశారు. పోలో రాజకుమార్, రంగు సెట్ డాక్టర్ రంగశెట్టి రమేష్, వంగాల శాంతి కృష్ణ ఆచార్య, మోహన్ రావు, కటకం రాజేంద్రప్రసాద్, అనిల్ కుమార్ శర్మ,డాక్టర్ ఎం వెంకటరమణ, మద్దిశెట్టి వెంకటేశ్వరరావు గోల్డ్ మెడల్ మెమెంటో నంది పురస్కారంతో సన్మానించారు. వెంకటేశ్వరరావు ఉద్యోగ విరమణ పొందిన తర్వాత కూడా కేజీబీవీ పాఠశాలలో మరియు మహాత్మ జ్యోతిబా పాఠశాలలో ఎస్ఓగా మరియు ప్రిన్సిపాల్ గా పనిచేసి అనేక మన్న న లను పొందారు. విద్యార్థుల పట్ల వీరికున్న సేవా నిరతికి గతంలో ఆరు గోల్డ్ మెడల్స్,15 అవార్డులు సాధించారు. గత నెలలో ఎంబీఆర్ యూనివర్సిటీ వారు వెంకటేశ్వరరావు కు డాక్టరేట్ రేట్ ప్రధానం చేశారు. ఇన్ని అవార్డులు ప్రశంసలు అందుకున్న వెంకటేశ్వరరావుకు పాపకొల్లు గ్రామస్తులు, తోటి ఉపాధ్యాయులు అభినందించారు.




## ప్రొఫెసర్ వినయ బాబును తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఛైర్మన్ గా నియమించాలి

హైదరాబాద్ డిసెంబర్ 12(మరో ఉదయం)

ముప్పై సంవత్సరాలు వివిధ పొజిషన్లో ముఖ్యంగా జేఎన్టీయూ కూకట్పల్లి ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపల్ గా చేసి, ఎందరికో పిహెచ్డీలు గైడ్ చేసి రిటైర్ అయిన తర్వాత కూడా ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీలో డీన్ గా చేస్తున్న నిబద్ధత గల అధ్యాపకుడు, 2011లోనే రాష్ట్ర ఉత్తమ ఉ పాధ్యాయుని అవార్డు ఆనాటి ఏపీ గవర్నమెంట్ లో అందుకున్న నిష్ణాతుడు ప్రొఫెసర్ వినయ బాబు. అంతేకాకుండా విద్యార్థి దశలోనే ఉ స్మానియా క్యాంపస్ విద్యార్థి ఉద్యమాల్లో, ఆ తర్వాత వివిధ ఉపాధ్యాయ, పౌర హక్కుల ఉ ద్యమాల్లో, మలిదశ తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా పాల్గొనడమే కాకుండా ఈనాటి టిపి జెఏసి కో-కన్వీనర్ గా కూడా ఉంటూ సామాజిక చైతన్యాన్ని కలిగిన నాయకుడు ప్రొఫెసర్ వినయ బాబు. ఇప్పటికైనా ఈ ప్రభుత్వమైనా ఈయన సేవలను గుర్తించి, తగిన స్థానాన్ని ముఖ్యంగా చైర్మన్ తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్ ను ఇవ్వాలని తెలంగాణ పౌర సమాజం కోరుతుంది.



## సంయుక్త కిసాన్ మోర్చా నాయకుల పై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలి. సంయుక్త కిసాన్ మోర్చా

వనపర్తి డిసెంబరు12

(మరో ఉదయం)

మూడు రైతు వ్యతిరేక నల్ల చట్టాల రద్దు సందర్భంగా కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర పూర్వకంగా ఇచ్చిన హామీని అమలు చేయకపోగా నాయకులపై అక్రమ నిర్బంధాన్ని తొలగించి కేంద్ర ప్రభుత్వము ఇచ్చిన హామీలను నిలుపుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాం ఎస్ కె ఎం జాతీయ సమన్వయ కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా రైతాంగ ఉద్యమం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం రైతు నాయకులపై అక్రమంగా మోపబడిన కేసులను కేసులను రద్దు చేయాలని, యద్వీర్ సింగ్ ప్రయాణాన్ని అడ్డుకోవడాన్ని నిరసిస్తూ దేశవ్యాప్తంగా రాష్ట్రపతికి జిల్లా కలెక్టర్ల ద్వారా వినతి పత్రాలు అందజేయాలని ఇచ్చిన పిలుపులో భాగంగా వనపర్తి జిల్లా సయుంక్త కిసాన్ మోర్చా సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో వనపర్తి జిల్లా అదనపు జిల్లాకలెక్టర్ కు విజ్ఞాపన పత్రం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్ జక్కుల వెంకటయ్య జిల్లా కన్వీనర్లు రాజన్న, రాబర్ట్, సి బాలయ్య, మాట్లాడుతూ తెలంగాణ నూతన ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని నిర్ణయం తీసుకున్నందుకు మంచి పరిణామమే, అదే రకంగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా రాష్ట్రంలోని రైతు సంఘాల ఆధ్వర్యంలో భూమి సమస్య, పోడు భూముల సమస్య, సాగునీటి సమస్య, వరి కొనుగోలు సమస్య, వివిధ రైతాంగ సమస్యల పరిష్కార ఆందోళనల చేసినందున రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలలో బిఆర్ఎస్ ప్రభుత్వం రైతులపై, రైతు సంఘాల నాయకులపై కేసులు పెట్టారు. ఈ కేసులను నూతన ప్రభుత్వం ఎత్తివేయాలని సంయుక్త కిసాన్ మోర్చా నూతన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ కార్యక్రమంలో చింతలయ్య కురుమన్న, కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణలో పలువురు ఐపిఎస్‌కు స్థానచలనం











**హైదరాబాద్ సిపిగా కొత్తకోట శ్రీనివాసరెడ్డి**
**సైబరాబాద్ సిపిగా అవినాశ్ మహంతి**
**రాచకొండ సిపిగా సుధీర్ బాబు**
**నార్కోటిక్ బ్యూరో డైరక్టర్‌గా సందీప్ శాండిల్యా**
**డిజిపి కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని స్టీఫెన్ రవీంద్ర,చౌహాన్‌లకు ఆదేశం**
**డిజిపి అంజనీకుమార్‌పై సస్పెన్షన్ ఎత్తేసిన ఎన్నికల సంఘం**

హైదరాబాద్,డిసెంబర్12 ((మరో ఉదయం):

తెలంగాణలో పలువురు ఐపిఎలస్‌ల బదిలీలు జరిగాయి. పలువురికి కొత్త పోస్టులను ఇవ్వగా పాతవారిని డిజిపి కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. తెలంగాణలో కొత్త ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి బాధ్యతలు చేపట్టాక రాష్ట్ర వ్యాప్తంగా ఐపీఎస్ బదిలీలకు మొదటిసారి శ్రీకారం చుట్టారు. కీలకమైన బాధ్యతల్లో ఉన్న ఐపీఎస్ అధికారుల బదిలీలు జరిగాయి. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ పరిధిలో కమిషనర్లను బదిలీ చేస్తూ రేవంత్ సర్కార్ నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్ నూతన సీపీగా కొత్త కోట శ్రీనివాస్‌రెడ్డి నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాచకొండ సీపీగా సుధీర్ బాబు , సైబరాబాద్ సీపీగా అవినాష్ మహంతి నియమితులయ్యారు. అలాగే హైదరాబాద్ పాత సీపీ సందీప్ శాండిల్యాను తెలంగాణ నార్కోటిక్ బ్యూరో డైరక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర, రాచకొండ సీపీ చౌహన్‌ను డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇదిలావుంటే

మాజీ డీజీపీ అంజనీ కుమార్‌పై కేంద్ర ఎన్నికల సంఘం సస్పెన్షన్ ఎత్తివేసింది. డిసెంబర్ 3న అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ముగియక ముందే పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డిని అప్పటి డీజీపీ అంజనీ కుమార్‌తోపాటు అదనపు డీజీ సంజయ్ కుమార్, మహేశ్ భగవత్ కలిశారు. దీంతో ఎన్నికల కోడ్ ఉ ల్లంఘించారని అంజనీ కుమార్‌ను సస్పెండ్ చేయగా, మిగిలిన ఇద్దరు ఐపీఎస్ అధికారులకు నోటీసులు జారీచేసింది. అయితే తాను ఉద్దేశపూర్వకంగా ఎన్నికల కోడ్ ఉ ల్లంఘించలేదని ఈసీకి మాజీ డీజీపీ తెలిపారు. ఎన్నికల ఫలితాల రోజున రేవంత్ రెడ్డి పిలిస్తే వెళ్లానని చెప్పారు. ఇలాంటి ఘటన పునరావృతం కాదని వివరణ ఇచ్చారు. ఆయన విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్న ఈసీ.. సస్పెన్షన్ ఎత్తివేస్తూ నిర్ణయం తీసుకున్నది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి సీఈసీ సమాచారం అందించింది. నవంబర్ 30న అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జరిగింది.. డిసెంబర్ 3న ఫలితాలు వెల్లడయ్యాయి. ఫలితాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధిక్యంలో కొనసాగింది. పూర్తిస్థాయిలో కౌంటింగ్ పూర్తికాకముందే డీజీపీగా ఉన్న అంజనీకుమార్ మధ్యాహ్నం సమయంలో ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఐపీఎస్ అధికారులు మహేశ్ భగవత్, సంజయ్ కుమార్‌తో కలిసి రేవంత్ వద్దకు వెళ్లిన ఆయన పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అయితే ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతోపాటు ఓట్ల లెక్కింపు పూర్తవకముందే డీజీపీ హోదాలో రేవంత్ రెడ్డిని కలవడంపై కేంద్ర ఎన్నికల సంఘం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆనపై సస్పెన్షన్ వేటువేసిన విషయం తెలిసిందే.

# ఎపికి ప్రత్యేకహోదా ఇవ్వాల్సిందే

**విబజన చట్టంలోనే దీనిని పొందుపరిచారు**
**నాటి ప్రధాని మన్మోమన్ హామీ కూడా ఇచ్చారు**
**మరోమారు ప్రత్యేకహోదా కోసం ప్రయత్నిస్తా**
**త్వరలోనే తెలంగాణ భవన్ నిర్మాణం చేపడతాం**
**తెలంగాణకు మణిహారంగా రీజినల్ రింగ్ రోడ్డు**
**మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వెల్లడి**

న్యూఢిల్లీ,డిసెంబర్12

(మరో ఉదయం):

ఎపికి ప్రత్యేక హోదా ఇవ్వాల్సిందేనని, విబజన చట్టంలోనే ఇది ఉందని

రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ఆంధ్రప్రదేశ్ కు ప్రత్యేక హోదా ఇవ్వాలని, అందుకు తన వంతు కృషి చేస్తానని మంత్రి వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక హోదా ఇస్తామని...అప్పటి ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఏపీని ఆదుకోవాలన్న లక్ష్యంతోనే పార్లమెంట్ సాక్షిగా ప్రత్యేక స్పెషల్ స్టేటస్ హామీ ఇచ్చారని అన్నారు. విభజన వేళ ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిజానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటే ఎప్పుడో హోదా దక్కేదని కోమటిరెడ్డి వ్యాఖ్యానించారు. ఢిల్లీలో పర్యటిస్తున్న కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఉమ్మడి ఏపీ భవన్‌కు వెళ్లారు. అక్కడ పలు బ్లాక్‌లను మంత్రి పరిశీలించారు. ఉమ్మడి ఏపీ భవన్ ఆస్తుల వివరాలు, రాష్ట్ర వాటాను అధికారులు మ్యాప్ ద్వారా ఆయనకు వివరించారు. ఆ తర్వాత తెలంగాణ భవన్ నిర్మాణ స్థలాన్ని కోమటిరెడ్డి పరిశీలించారు. వచ్చే ఏడాది ఏప్రిల్ నాటికి ఢిల్లీలో తెలంగాణ భవన్ నిర్మాణ పనులు చేపట్టాలనుకుంటున్నట్లు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. ఉమ్మడి ఏపీ భవన్‌కు చెందిన ఆస్తులను పరిశీలించామన్న ఆయన.. తెలంగాణ భవన్ నిర్మాణ వివరాలను సీఎంకు వివరిస్తానన్నారు. ఇప్పటికే నిర్మాణం ఆలస్యమైందన్న కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఉ మ్మడి ఏపీ భవన్ విషయంలో తెలుగు రాష్ట్రాల మధ్య ఎలాంటి వివాదం లేదని స్పష్టం చేశారు. త్వరలో రీజనల్ రింగ్ రోడ్ పనులు ప్రారంభిస్తామన్నారు. నేషనల్ హైవేస్ అథారిటీ ఛైర్మన్‌ను కలిసి చర్చిస్తానన్న ఆయన, గత ప్రభుత్వం రూ. 300 కోట్ల విషయంలో ప్రాజెక్టు ముందుకు వెళ్లకుండా చేసిందన్నారు. రూ. 20 వేల కోట్ల విలువైన ప్రాజెక్టు పూర్తిగా కేంద్రం భరిస్తోందన్న కోమటిరెడ్డి, యుటిలిటీ ఖర్చులను రాష్ట్ర ప్రభుత్వం భరించాలని కోరిందన్నారు. గత ముఖ్యమంత్రి రూ. 300 కోట్లు ఇవ్వలేమని లేఖ రాయడంతోనే పనులు ప్రారంభం కాలేదని గుర్తు చేశారు. 340 కి.మీ పొడవైన రీజనల్ రింగ్ రోడ్ తెలంగాణకే మణిహారం అని, సగం తెలంగాణ రాష్ట్రం దీని కింద కవర్ అవుతుందన్నారు. దేశంలో మరెక్కడా ఇంత పెద్ద రింగ్ రోడ్డు ప్రాజెక్టు లేదన్నారు.ముఖ్యమంత్రితో చర్చించి యుటిలిటీ ఖర్చులు భరిస్తామంటూ కేంద్రానికి లేఖ రాయిస్తానన్నారు. నెల రోజుల్లో టెండర్లు పిలిచి పనులు ప్రారంభించేలా చూస్తామని, రూ. 60 కోట్లకు ఒక టెండర్ చొప్పున బిట్లుగా పనిని విభజించి త్వరగా పూర్తయ్యేలా చూస్తామని వెల్లడించారు. రేవంత్ రెడ్డి కేబినెట్ లో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆర్ అండ్ బీ, సినిమాటోగ్రఫీ మినిస్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. నల్గొండ నియోజకవర్గం నుంచి గెలుపొందిన ఆయన ఎన్ఎస్‌యూఐ ద్వారా రాజకీయాల్లోకి ఆరంగేట్రం చేశారు. 1999, 2004, 2009, 2014 అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొందారు. నల్గొండ స్థానం నుంచి వరసగా 3 సార్లు విజయం సాధించిన తొలి సభ్యుడిగా పేరు సంపాదించుకున్నారు. వైఎస్, రోశయ్య మంత్రివర్గాలలో ఐటీ, యువజన సర్వీసులు, క్రీడల మంత్రిగా పని చేశారు. కిరణ్ కుమార్ రెడ్డి మంత్రివర్గంలో మౌలిక వసతులు, పెట్టుబడులు శాఖల మంత్రిగా పని చేసిన ఆయన, తెలంగాణ ఉద్యమ నేపథ్యంలో 2011 అక్టోబరు 5న మంత్రి పదవికి రాజీనామా చేశారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో నల్గొండ నియోజకవర్గం నుంచి

కాంగ్రెస్ తరపున పోటీ చేసి ఓటమి పాలయ్యారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో భువనగిరి నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున ఎంపీగా విజయం సాధించారు. బీఆర్ఎస్ అభ్యర్థి బూర నర్సయ్య గౌడ్ పై 4500 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. 2022 ఏప్రిల్ 10న శాసనసభ ఎన్నికల స్టార్ క్యాంపెనర్‌గా నియామకం అయ్యారు. 2023 సెప్టెంబర్ 20న కాంగ్రెస్ ఎన్నికల స్క్రీనింగ్ కమిటీలో స్థానం సంపాదించారు. తాజాగా జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో నల్గొండ నుంచి పోటీ చేసి విజయం సాధించి...మంత్రిగా బాధ్యతలు చేపట్టారు.



# రేపల్లె ఇన్‌ఛార్జిగా ఈపూరి గణెళిశ్

## మండిపడుతున్న మోపిదేవి అనుచరులు

బాపట్ల,డిసెంబర్12((మరో ఉదయం):

రేప్లలె నియోజకవర్గం ఇంచార్జ్ గా ఈపూరి గణెళిష్ ను నియమించడంతో వైసీపీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఇప్పటి వరకూ రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణ రేప్లలె ఇంచార్జ్ గా ఉన్నారు. ఆయన తన కుటుంబసభ్యుల్లో ఒకరికి టిక్కెట్ ఇప్పించాలనుకున్నారు. కానీ కొత్తగా ఈపూరి గణెళిష్ ను ఇంచార్జ్ గా నియమించారు. ఇప్పటి వరకు రేప్లలె వైసీపీ అంటే మోపిదేవి వెంకటరమణ . రమణ అంటే వైసీపీ అన్న విధంగా ఉండేది .వైసీపీ పార్టీలో సెకండ్ లీడర్ అన్న పదమే లేకుండా అప్పటి వరకు మోపిదేవి నాయకత్వం కొనసాగింది. ఒక్క సారిగా ఈపూరు గణెళిష్‌ను నియోజక వర్గం ఇంచార్జ్ గా పార్టీ నియమించడంతో మోపిదేవి అభిమానులు జీర్ణించుకోలేక పోతున్నారు. మోపిదేవికి అన్యాయం జరిగిందని రోడ్డుపై రాత్రి టైర్లు తగలబెట్టి రాత్రి నరసనకు దిగారు...ఈ రోజు నియోజకవర్గం లో నామినేట్ పదవులు ఉన్న వారు రేప్లలె పార్టీ ఆఫీస్ లో సమావేశం అయ్యారు...ఇంచార్జ్ గా మోపిదేవి వెంకట రమణనే నియమించాలని డిమాండ్ చేశారు...వైసీపీ ఇంచార్జ్ గా ఈపూరి గణెళిష్ నియామకం పట్ల తమ నిరసనను వ్యక్తం చేస్తూ మూకుమ్మడిగా తమ పదవులకు రాజీనామా చేశారు... రాజీనామా చేసిన వారిలో ఛైర్మన్లు, ఎంపీపీ,ఎంపీటీసీ, జడ్పీటీసి లు, మార్కెట్ యార్డ్ ఛైర్మన్లు, మెంబర్లు ఉన్నారు... మోపిదేవి రమణ అభిమానులు సహితం తమ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేశారు. టీడీపీకి కంచుకోటగా ఉన్న రేప్లలె నియోజకవర్గంలో పాగా వేయాలని వైసీపీ చూస్తుంది. రేప్లలెలో వైసీపీ ఇంతవరకు గెలవలేదు..1983 నుంచి ఇక్కడ టీడీపీ సత్తా చాటుతుంది. 1989, 2004, 2009 ఎన్నికల్లో ఇక్కడ కాంగ్రెస్ గెలిచింది?ఇక మిగిలిన అన్నీ సార్లు టీడీపీ గెలిచింది. చివరి రెండు ఎన్నికల్లో రేప్లలెలో టీడీపీదే పైచేయి. 2014, 2019 ఎన్నికల్లో టీడీపీ నుంచి అనగాని సత్యప్రసాద్ గెలుస్తూ వస్తున్నారు..మోపిదేవి వెంకటరమణ ఓడిపోతూ వస్తున్నారు. మోపిదేవి రాజ్యసభకు వెళ్ళడంతో ఎన్నికల్లో పోటీ చేసే అవకాశాలు కనిపించడం లేదు. ఇదే క్రమంలో తన వారసుడుని బరిలో దింపాలని చూశారు. ఇప్పటికే మోపిదేవి వారసుడు రాజీవ్?రేప్లలెలో యాక్టివ్ గా పనిచేస్తూ వస్తున్నారు. అక్కడ పంచాయితీ, పరిషత్, మున్సిపల్ ఎన్నికల్లో వైసీపీ విజయం సాధించడంలో కీలక పాత్ర పోషించారు. కానీ హఠాత్తుగా రేప్లలె నుంచి టీడీపీలో మంత్రిగా పని చేసిన ఈపూరు సీతారావమ్మ కుమారుడు డాక్టర్ ఈపూరు గణెళిష్ ను ఇంఛార్జ్ గా నియమించారు. దీంతో మోపిదేవి అనుచరులు రగిలిపోతున్నారు. రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణ ఇంకా బహిరంగంగా ఎలాంటి ప్రకటనలు చేయలేదు.

# పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్మన్ రాజీనామా

## ఇంకా ఆమోదించని గవర్నర్ తమిళసై

## కోర్టులో కేసు ఉండడమే కారణమని భావన

హైదరాబాద్,డిసెంబర్12((మరో ఉదయం):

టిఎస్‌పిఎస్‌సి ఛైర్మన్ జనార్ధన్ రెడ్డి రాజీనామాను గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ఆమోదించలేదు. సోమవారం సాయంత్రం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో జనార్ధన్ రెడ్డి సమావేశమైన తరువాత అతడు రాజీనామా చేశారు. రాజీనామాను ఆమోదించినట్లు వస్తున్న వార్తలు అవాస్తవం అని రాజ్‌భవన్ వర్గాలు వెల్లడించాయి. గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ప్రస్తుతం పుదుచ్చేరిలో ఉన్నారని వివరించాయి. జనార్ధన్ రెడ్డి రాజీనామా లేఖ గవర్నర్ పరిశీలనలో ఉందని వెల్లడించాయి. పుదుచ్చేరిలో ఉన్న గవర్నర్‌కు అన్ని వివరాలు పంపించామని పేర్కొన్నాయి. పేపర్ లీకులు అయినప్పుడే నిరుద్యోగుల భవిష్యత్తు దృష్టిలో పెట్టుకుని టీఎస్పీఎస్సీ బోర్డును రద్దు చేయాలని కోరుతూ రాష్ట్రపతికి గవర్నర్ తమిళసై లేఖ రాశారు. అప్పుడు దానిని డీఓపీటీకి రాష్ట్రపతి అధికారులు పంపించారు. టీఎస్ పీఎస్సీ వ్యవహారంపై వివరణ ఇవ్వాలని .. ఏం జరిగిందో చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వానికి అక్కడి నుంచి లేఖ అందింది. మునుపటి బీఆర్ఎస్ ప్రభుత్వం స్పందించకుండా సైలెంట్‌గా ఉండిపోయింది. ఇపుడు ప్రభుత్వం మారగానే టీఎస్ఎస్‌పీఎస్సీ ఛైర్మన్ రాజీనామా లేఖ ఇచ్చారు. ఇప్పటికే కోర్టులో పేపర్ లీకు కేసు ఉంది. గతంలో చర్యలు తీసుకునేలా బోర్డును పుర్తిగా రద్దు చేసేలా ముందుకి వెళ్లడమా..? లేదంటే జనార్దన్ రెడ్డి రాజీనామాను ఆమోదించడమా? అనే దానిపై గవర్నర్ సందిగ్ధంలో ఉన్నారు. రాజీనామా ఆమోదిస్తే పేపర్ లీకు సంగతి అంతేనా అనే ఆలోచనలో గవర్నర్ తమిళి సై ఉన్నారు. లీగల్ ఒపీనియన్ తీసుకోవడంతో పాటు.. ప్రస్తుత రాష్ట్ర సర్కార్ స్టాండ్ తెలుసుకునేందుకు సీఎస్‌కు లేఖ రాసే అవకాశం ఉంది.

# మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డికి ఉచ్చు

## రుణం చెల్లింపు కోసం ఫైనాన్స్ కార్పోరేషన్ నోటీసులు

## ఇప్పటికే ఆర్టీసి, విద్యుత్ సంస్థల తాఖీదులు

నిజామాబాద్,డిసెంబర్12((మరో ఉదయం):

ఆర్మూర్ బీఆరెస్స్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి చుట్టూ ఉచ్చు బిగుస్తోంది. ఇంతకాలం అధికార పార్టీలో ఉండి చేసిన అక్రమాలకు సమాధానం చెప్పుకోలేక పోతున్నారు. ఆర్టీసీ, ట్రాన్స్ కో అధికారులు ఏకకాలంలో బకాయిల వసూలుకు చర్యలు ప్రారంభిస్తూ షాక్ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఇదే క్రమమో తాజాగా మరో షాక్ తగిలింది. ఇందులో భాగంగా తమ వద్ద తీసుకున్న రూ.20 కోట్ల రుణం వడ్డీతోకలిపి మొత్తం కలిపి రూ. 45 కోట్లు చెల్లించాలంటూ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ అధికారులు నోటీసులు జారీ చేశారు. గతంలో ఆయన తనపై కాల్పులు జరిగాయంటూ నానా హంగామా చేశారు. మొత్తంగా ఇప్పుడు ఆర్మూర్ బీఆరెస్స్ మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డికి అధికారులు గ్యాప్ ఇవ్వడలేదు! ఈ క్రమంలో తాజాగా ఆయన ఇంటికి స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ అధికారులు నోటీసులు అంటించారు. అసలు రూ. 20 కోట్లు, వడ్డీ రూ. 25కోట్లు చెల్లించాలని ఆ నోటీసుల్లో కోరారు. దీంతో ఏమిటి లోన్, ఎవరి పేరున తీసుకున్నారు, ఎప్పుడు తీసుకున్నారు, ఇంతకాలం ఎందుకు చెల్లించకున్నారు.. మొదలైన ప్రశ్నలు తెరపైకి వస్తున్నాయి. కార్పొరేషన్ నుంచి మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి రూ.20కోట్లు రుణం తీసుకున్నారు. 2017లో ఆయన సతీమణి రజిత రెడ్డి పేరున జీవన్ రెడ్డి ఈలోన్ తీసుకున్నారని తెలుస్తుంది. అయితే నాటి నుంచి నేటి వరకు వడ్డీలు డబ్బు కూడా చెల్లించలేదని అంటున్నారు. ఫలితంగా అసలు ప్లస్ వడ్డీ కలిసి రూ.45 కోట్ల బకాయి ఉందని అధికారులు తెలిపారు. ఈ క్రమంలో తాజాగా ఆయన ఇంటికి వెళ్లిన అధికారులు నోటీసులు అంటించారు. దీంతో ఇంటికి నోటీసులు అంటించిన అంశం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. అయితే జీవన్ రెడ్డి మాత్రం ఈ విషయంపై ఇంకా స్పందించలేదు! జీవన్ రెడ్డికి ఆర్టీసీ, ట్రాన్స్ కో అధికారులు ఏకకాలంలో బకాయిల వసూలుకు చర్యలు ప్రారంభిస్తూ ఇప్పటికే నోటీసులు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా... ఆర్మూర్ పట్టణంలోని జీవన్ రెడ్డి సతీమణి రజితరెడ్డి తాను మేనేజింగ్ డైరెక్టర్ గా ఉన్న విష్ణుజిత్ ఇన్ ఫ్రా డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరిట టీఎస్ ఆర్టీసీ స్థలాన్ని లీజ్ కు తీసుకుని మాల్ అండ్ మల్టిప్లెక్స్ పేరిట ఐదు అంతస్తుల భారీ షాపింగ్ మాల్ నిర్మించారు.

# తుఫాన్ వల్ల నష్ట పోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

జూలూరుపాడు డిసెంబర్12((మరో ఉదయం):

తుఫాన్ వల్ల నష్ట పోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ మంగళవారం

జూలూరుపాడు మండల తహసిల్దార్ కు సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జాటోత్ కృష్ణ మాట్లాడుతూమీ చాంగ్ తుఫాన్ వల్ల ఆకాలవర్షలతో రైతులు తమ పంటలను తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. వరి, పత్తి, మిరప, మొక్కజొన్న మరియు ఆకుకూరలు, కూరగాయల తోటలు వర్షాల వల్ల నేలమట్టం అయి రైతాంగం ఆర్థికంగా నష్టం పోయారని, ఈ వర్షం వల్ల నష్ట పోయిన పంటలను సమగ్రంగా సర్వే జరిపి నష్టపరిహారం అందించాలని ఆయన కోరారు,వరి పంట కు ఎకరానికి 25 వేల రూపాయలు, పత్తి పంటకు ఎకరానికి. 50 వేల రూపాయలు , మిరప పంటకు ఎకరానికి 1 లక్ష రూపాయలు, మొక్కజొన్న ఆకు కూరలు - కాయ గూరలు తోటల కు ఎకరానికి. 30 వేల రూపాయలు చొప్పున నష్ట పరివారం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ ప్రజా పంథా డివిజన్ నాయకులు ఏదులాపురం గోపాలరావు, సిపిఐ ఎంఎల్ ప్రజా పంథా జూలూరుపాడు సుజాతనగర్ సంయుక్త మండల కార్యదర్శి భానోత్ ధర్మ, , మండల నాయకులు పారుపల్లి బాబురావు మంద్రాజుల కృష్ణయ్య, లింగాల వీరభద్రం, రాయల సిద్దు తదితరులు ఉన్నారు



# ఆంధ్రాలోనూ తెలంగాణ ఫలితాలే

## జగన్‌కు ఓటమి

## తప్పదన్న నారాయణ

తిరుపతి,డిసెంబర్12((మరో ఉదయం):

తెలంగాణ ఎన్నికల ఫలితాలే ఏపిలోనూ పునరావృతం కాబోతాయని, వచ్చే ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డి ఓడిపోవడం ఖాయమని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ ఆరోపించారు.. తిరుపతిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఏపీ రాష్ట్ర ప్రభుత్వంపై సంచలనాత్మక వ్యాఖ్యలు చేశారు.. వచ్చే ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డి ఓడిపోవడం ఖాయంమని, అవినీతికి పాల్పడమని ఎమ్మెల్యేలకు చెప్పిందే జగన్మోహన్ రెడ్డి అని నారాయణ ఆరోపించారు.. రాష్ట్రాన్ని దోచేసిన తరువాత ఇన్చార్జ్ లను మార్చినంత మాత్రాన ఉపయోగమేంటని ఆయన ప్రశ్నించారు.. ఇన్చార్జ్ లు, ఎమ్మెల్యే అభ్యర్థులు కాదని.. అసలు వైఎస్ఆర్ సీపీలో సీఎం అభ్యర్థినే మార్చాలని నారాయణ డిమాండ్ చేసారు.ప్రజా స్వామ్యాన్ని అపహాస్యం చేయడం, పాలన చేత కాకపోవడం వచ్చే ఎన్నిఅకల్లో జగన్ ఓటమికి ప్రధాన కారణాలు అని ఆయన తెలియజేశారు.. గాల్లో తిరిగే జగన్మోహన్ రెడ్డి అదే గాల్లోనే కలిసిపోవడం ఖాయంమని, పొగరు, అవినీతి, అహంకారంకు జగన్మోహన్ రెడ్డి కేరాఫ్ అడ్రస్ అని అన్నారు. బైజూస్ బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని చెప్పిన ఆయన, బైజ్యూస్, బజాజ్ కార్యాలయాలను పగలగొట్టాలని అన్నారు. తుపాను వల్ల తిరుపతి జిల్లాలో 60 వేల ఎకరాల్లో వరి పంట నష్టం జరిగిందని, 18 లక్షల ఎకరాలలో అన్ని రకాల పంట నష్టం జరిగిందని అన్నారు.. మిచౌన్ తుపాన్ ను జాతీయ విపత్తుగా ప్రకటించాలని కోరారు.. జమ్ము కశ్మీర్ పైన, 370 అర్టికల్ పైన వచ్చిన తీర్పు దురదృష్టకరమని ఆయన వ్యతిరేకించారు.. న్యాయ వ్యవస్థ ఒక పంజరంలోని చిలుకగా మారిందని, స్వాతంత్ర పోరాటంలో పాల్గొనని పార్టీలకు దాని ప్రాదాన్యత ఎలా తెలుస్తుందని అన్నారు.అందుకే 370 ఆర్టికల్ గురించి వారికి తెలియడం లేదని అన్నారు.. భారతదేశాన్ని విడగొట్టే రీతిలో బీజేపీ పాలన సాగుతోందని, చివరకు నిజంకు వ్యతిరేకంగా కూడా బీజేపీ పోరాడలేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.. సుప్రీంకోర్టు తప్పు చేసిందని చెబుతున్నా, అరెస్ట్ చేసినా ఫర్వాలేదని, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్వీ రమణ డెకాయిట్లతో సైతం రాజీ పడ్డారని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ మండిపడ్డారు.

TUE - M U_SAT - M U.qxd 13-12-2023 08:47 AM Page 4






# 21న విడుదల కానున్న డంకీ

## వైష్ణోదేవి ఆలయంలో షారూఖ్ పూజలు

ఒకే ఏడాది రెండు వెయ్యి కోట్ల సినిమాలు చేసిన హీరోగా షారుఖ్ ఖాన్ సంచలనం సృష్టించాడు. ఈ ఏడాది ప్రథమార్థంలో 'పఠాన్'తో కలెక్షన్ కోత సృష్టిస్తే. ద్వితియార్థంలో 'జవాన్'తో కలెక్షన్‌ల మోత మోగించారు. ఇప్పుడు ఏడాది చివర్లో మరో సంచలనానికి సిద్ధమవుతున్నాడు ఈ బాలీవుడ్ బాద్‌షా. ప్రస్తుతం షారుఖ్ నటించిన 'డంకీ' చిత్రం విడుదలకు సిద్ధమైన విషయం తెలిసిందే. డిసెంబర్ 21వ తేదీన ఈ చిత్రం ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో చిత్ర రిలీజ్‌కు ముందు షారుఖ్ ప్రముఖ పుణ్యక్షేత్రం జమ్మూకశ్మీర్‌లోని మాతా వైష్ణో దేవి ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది. కాగా, ఏడాదిలో వైష్ణోదేవి ఆలయాన్ని షారుఖ్ సందర్శించడం ఇది మూడోసారి. జవాన్ చిత్రానికి ముందు గతేడాది డిసెంబర్‌లో షారుక్.. వైష్ణోమాతా ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆ తర్వాత 'పఠాన్' రిలీజ్‌కు ముందు కూడా ఆయన ఆ ఆలయాన్ని సందర్శించారు. ఆగస్టులో అక్కడికి వెళ్లి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆ రెండు చిత్రాలు సూపర్ డూపర్ హిట్ కావడంతో.. మూడోసారి 'డంకీ' రిలీజ్‌కు ముందు కూడా షారుఖ్ వైష్ణోదేవి ఆలయాన్ని సందర్శించారు. దీంతో ఈ చిత్రం కూడా హిట్ అవుతుందంటూ ఫ్యాన్స్ చెప్పుకుంటున్నారు.





# 22న రిలీజ్‌కు సలార్ సిద్ధం

## పాటల విడుదల పై అభిమానుల్లో ఆత్రుత

పాన్ ఇండియా స్టార్ హీరో ప్రభాస్ కాంపౌండ్ నుంచి వస్తున్న చిత్రం సలార్. యాక్షన్ థ్రిల్లర్ జోనర్‌లో వస్తోన్న ఈ మూవీకి కేజీఎఫ్ ఫేం ప్రశాంత్ నీల్ దర్శకత్వం వహిస్తున్నాడు. సలార్ రెండు పార్టులుగా తెరకెక్కుతుండగా.. డిసెంబర్ 22న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదలకు రెడీ అవుతోంది. రిలీజ్ డేట్ దగ్గర పడుతున్న నేపథ్యంలో మేకర్స్ ఏదో ఒక అప్‌డేట్‌తో మూవీ లవర్స్‌లో జోష్ నింపుతున్నరు. సలార్ ఫస్ట్ సింగిల్‌కు అంతా సిద్ధమైంది. హోంబలే మ్యూజిక్‌లో పాటలను మీ ముందుకు తీసుకురాబోతున్నామని ట్వీట్ చేశారు మేకర్స్. మరికొద్ది సేపట్లో ఫస్ట్ సింగిల్ ప్రకటన ఉండబోతుందన్న అప్‌డేట్‌తో ఫుల్ ఖుషీ అవుతున్నారు మూవీ లవర్స్. ఇటీవలే లాంఛ్ చేసిన సలార్ ట్రైలర్ నెట్టింట వ్యూస్ పంట పండిస్తూ.. టాక్ ఆఫ్ ది గ్లోబల్ ఇండస్ట్రీగ్రా మారుతోంది. ఇటీవలే సలార్ సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకోగా.. సలార్‌కు సీబీఎఫ్‌సీ ఏ సర్టిఫికెట్ జారీ చేసింది. సలార్ రన్ టైం 2 గంటల 55 నిమిషాల 22 సెకన్లు. యాక్షన్ డ్రామా నేపథ్యంలో వస్తున్న సలార్‌లో మాలీవుడ్ సూపర్‌స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్

వరదరాజ మన్నార్ ది కింగ్ పాత్రలో నటిస్తోంది. ఇప్పటికే విడుదల చేసిన వరదరాజ మన్నార్ ది కింగ్ లుక్ ఇప్పటికే నెట్టింట హల్ చల్ చేస్తుండగా.. శృతిహాసన్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. సలార్‌ను కేరళలో పృథ్వీరాజ్ సుకుమారన్ హోం బ్యానర్ పృథ్వీరాజ్ ప్రొడక్షన్స్ హౌజ్ విడుదల చేస్తోంది. నైజాంలో టాలీవుడ్ పాపులర్ ప్రొడక్షన్ బ్యానర్ మైత్రీ మూవీ మేకర్స్ సలార్‌ను రిలీజ్ చేస్తుండగా.. నార్తిండియాలో అనిల్ తడని ఈ సినిమాను విడుదల చేస్తోంది. ఇక ఓవర్సీస్‌లో సలార్‌ను విడుదల చేస్తోంది.




# లవ్‌ట్రాక్‌లో పడ్డ అడవిశేష్

## శృతిహాసన్‌తో కొత్త సినిమా



టాలీవుడ్‌లో ఉన్న యంగ్ డైనమిక్ హీరోల్లో ఒకరు అడివిశేష్. క్షణం, గూడఛారి, మేజర్, హిట్ 2 సినిమాలతో హీరోగా తనకంటూ సూపర్ ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించుకున్నాడు. ఈ క్రేజీ హీరో కాంపౌండ్ నుంచి ఇప్పటికే గూఢచారి 2 వస్తున్న విషయం తెలిసిందే. తాజాగా అడివిశేష్ కొత్త సినిమాకు సంబంధించిన ప్రకటన ఒకటి బయటకు వచ్చింది. ఈ సారి లవ్ స్టోరీతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. ప్రేమ.. దాని వెనకున్న యూనిక్ స్టోరీని మీ ముందుకు తీసుకొచ్చేందుకు అడివిశేష్, శృతిహాసన్ కలిసి వస్తున్నారు.. నయా సినిమాకు సంబంధించిన అప్‌డేట్ ఒకటి నెట్టింట వైరల్ అవుతోంది. ఈ చిత్రాన్ని అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్‌పై సుప్రియ యార్లగడ్డ నిర్మిస్తుండగా.. ఆసియన్ సునీల్ సహనిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రానికి కథనందిస్తూ దర్శకత్వం వహిస్తున్నాడు. మొత్తానికి చాలా కాలం తర్వాత అడివిశేష్ నుంచి లవ్ ట్రాక్ రాబోతుండటంతో అంతా ఆసక్తి నెలకొంది. ఈ మూవీ షూటింగ్ ప్రారంభమైనట్లు తెలియజేస్తూ అడివి శేష్.. 'జీ2' నుంచి ప్రీ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఈ సీక్వెల్‌ను పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ, అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్ బ్యానర్‌లపై టీజీ విశ్వప్రసాద్, అభిషేక్ అగర్వాల్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. శేష్ ఎక్స్ శృతి అంటూ తాజాగా ఈ సినిమాకు సంబంధించిన అప్‌డేట్‌ని మేకర్స్ వదిలారు. శృతిహాసన్ ఆ మధ్య లవ్ అంటూ.. సినిమాలకు కాస్త గ్యాప్ ఇచ్చింది. ఆమె ప్రేమాయణంలో కాస్త గందరగోళం నెలకొనడంతో తిరిగి సినిమాలలోకి రీ ఎంట్రీ ఇచ్చింది. రీ ఎంట్రీలో ఆమెకు మంచి హిట్స్ కూడా పడ్డాయి. 'వాల్తేరు వీరయ్య', 'వీరసింహారెడ్డి' సినిమాలతో హిట్స్ అందుకున్న శృతిహాసన్ రీసెంట్‌గా వచ్చిన 'హాయ్ నాన్న' సినిమాలోనూ మెరిసింది. ఇప్పుడు ప్రభాస్ సరసన

'సలార్'తో సంచలనానికి సిద్ధమవుతోంది. రీ ఎంట్రీలో స్టార్ హీరోలకే ఇంపార్టెన్స్ ఇచ్చిన శృతి.. ఇప్పుడు యంగ్ హీరో శేష్‌తో పాన్ ఇండియా ప్రాజెక్ట్‌కు సిద్ధమైంది. ప్రస్తుతానికి మేకర్స్ ఈ వివరాలను మాత్రమే రివీల్ చేశారు. ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. అయితే అడివి శేష్ ఇప్పటి వరకు సస్పెన్స్ థ్రిల్లర్స్‌తో అలరిస్తూ వస్తున్నాడు. కానీ ఈ ప్రాజెక్ట్ అనౌన్స్‌మెంట్ చూస్తుంటే.. ఇదొక లవ్ స్టోరీ అని తెలుస్తుంది. ఈ లవ్ స్టోరీతో శేష్ ఎలా మెప్పిస్తాడో చూడాల్సి ఉంది. ఈ సినిమా విషయమై శేష్.. శృతిహాసన్‌తో ఉన్న ఫొటోలను షేర్ చేసి తన ఆనందాన్ని తెలియజేశాడు. ప్రస్తుతం ఆ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.



# సూర్యతో పనిచేయడం ఓ థ్రిల్: బాబీ డియోల్

28 ఏళ్ల తర్వాత 'యానిమల్'తో సూపర్ హిట్ అందుకున్నారు బాబీ డియోల్ . ప్రస్తుతం ఆయన వరుస చిత్రాలతో బిజీగా ఉన్నారు. అటు తమిళం, ఇటు తెలుగు చిత్రాలతో ముందుకెళు తున్నారు. తెలుగులో 'హరిహర వీరమల్లు'తోపాటు బాలకృష్ణ చేయబోయే ఓ చిత్రంలో కీలక పాత్రలు పోషిస్తున్నారు. తమిళంలో సూర్య నటిస్తున్న 'కంగువా'లో విలన్ గా కనిపించనున్నారు. తాజాగా ఈ సినిమాలోని తన పాత్ర గురించి ఆసక్తికర విషయాలు చెప్పారు బాబీ దేవోల్. 'కంగువా' కథ, అందులో నా పాత్ర బాగా నచ్చింది. ఇక చిత్ర బృందం అయితే ఎప్పటికీ గుర్తుండిపోతుంది. సూర్య నటన అద్భుతంగా ఉంటుంది. అలాంటి అంకితభావం ఉన్న నటుడితో పని చేయడం ఆనందంగా ఉంది. తమిళంలో నా తొలి చిత్రమిది. ఇప్పటి దాకా ఈ తరహా పాత్ర చేయలేదు. ఇందులోనేను చేస్తున్న పాత్ర నా కంఫర్ట్ జోన్లో లేదు. ఎందుకంటే నాకు ఈ భాష తెలియదు. రెండు నెలల్లో తమిళం నేర్చుకోలేను' అని అన్నారు. కంగ అనే ఓ పరాక్రముడి కథతో ఈ సినిమా తెరకెక్కుతోంది. ఇందులో సూర్య ఆరు భిన్నమైన అవతారాల్లో కనిపించనున్నారు. శివ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రమిది. 38 భాషల్లో విడుదల చేయడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. ఐమ్యాక్స్, 3డీ వెర్షన్‌లోనూ ఇది అందుబాటులో ఉండనుంది. దిశా పఠానీ కథానాయికగా నటిస్తుండగా..వచ్చే ఏడాది వేసవి కానుకగా ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు.



# 15న విడుదలకు సిద్ధంగా అఘోరి

బుల్లితెర నటుడు సిద్ధు సిధ్ కథానాయకుడిగా మారి..హీరోగా నటించిన 'అఘోరి' చిత్రం ఈనెల 15న విడుదలకు సిద్ధమైంది. ఇందులో షాయాజీ షిండే వైవిధ్యభరితమైన పాత్రను పోషించారు. పీవీఆర్ పిక్చర్స్ విడుదల చేసే ఈ చిత్రాన్ని మోషన్ ఫిల్మ్ పిక్చర్స్ ఐఎన్‌సీ పతాకంపై నిర్మాత సురేష్ కే మేనన్ నిర్మించారు. డీఎస్ రాజ్‌కుమార్ దర్శకత్వం వహించారు. శృతి రామకృష్ణన్ హీరోయిన్‌గా నటించగా, ఇతర పాత్రలను మైమ్ గోపి, డార్లింగ్ మదన గోపాల్, రియామికా, మాధవి, వెట్రి, కార్తీ, శరత్, డిజైనర్ భవన్ తదితరులు పోషించారు. వసంత్ ఛాయాగ్రహణం అందించగా, ఫోర్ మ్యూజిక్ బ్యాండ్ పేరుతో నలుగురు సంగీత దర్శకులు సంగీత స్వరాలను సమకూర్చారు. ఈ చిత్ర కథను దర్శకుడు డీఎస్ రాజ్‌కుమార్ వివరిస్తూ... ఇది పూర్తిగా వినోదాత్మక చిత్రం. ఆరు నుంచి అరవైయేళ్ళ వారు చూసేలా అన్ని రకాల కమర్షియల్ ఫీచర్లతో రూపొందించాం. అఘోరిగా షిండే అద్భుతంగా నటించారు. కేరళలోని అటవీ ప్రాంతాల్లో వేసిన భారీ సెట్లలో అఘోరీలతో ఉండే సన్నివేశాలను భీతిగొల్పేలా తెరకెక్కించాం. సినిమాలో గ్రాఫిక్స్ ప్రతి ఒక్కరినీ అబ్బురపరిచేలా ఉంటాయి. తెలుగులో 'సహా' చిత్రంలో నటించిన జక్కుల్లా బాబు ప్రతి నాయకుడి పాత్రను పోషించారు. కర్ణాటక ప్రభుత్వం నుంచి ఉత్తమ అవార్డు స్వీకరించిన శృతి రామకృష్ణన్ హీరోయిన్‌గా నటించారని వివరించారు.



Printed,Published and Owned by GILAKARA SRIDHAR,Printed at M/S Kakatiya Printers,H.No.24-91/72,73,74 IDA,Uppal,Uppal Mandal,Medchal-Malkajgiri District, Telangana., Published at, H.No. 1-5-631/276,Ambedkar Colony, Old Alwal Village, Alwal Mandal, Medchal-Malkajgiri District,Telangana., Cell : 91548 42842, Editor: GILAKARA SRIDHAR RNI No. TELTEL/2016/71618., Email : maroudayam20@gmail.com